క్లుప్తంగా

ప్రాధాన్యత భవన నిర్మాణాలు లక్ష్యం మేరకు పూర్తిచేస్తాం

కలెక్టర్ రాజాబాబు



చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను నిర్దేశించిన లక్ష్యం మేరకు పూర్తి చేస్తామని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. సచివాలయం నుంచి గురువారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణాల ప్రగతి, ఖరీఫ్‌లో ధాన్యం సేకరణ, రీ–సర్వే, గృహ నిర్మాణం తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమీక్షలో జిల్లా ప్రగతిని కలెక్టర్ రాజాబాబు సీఎస్‌కు వివరించారు. జిల్లాలో 281 గ్రామ సచివాలయ భవనాలను నిర్మించాల్సి ఉండగా ఇప్పటికే 172 గ్రామ సచివాలయ భవనాలను పూర్తిచేసి అప్పగించామని చెప్పారు. 172 ఆర్బీకే భవనాలకు గానూ 108 భవనాలు, 123 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాలకు గానూ 56 భవనాలను పూర్తి చేశామన్నారు. జిల్లాలో 317 కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణను నిర్వహిస్తామని చెప్పారు. గృహ నిర్మాణ ప్రగతిని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, డీఆర్వో పెద్ది రోజా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వామివారిని దర్శించుకున్న నటుడు నాగ మహేష్



మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని ప్రముఖ సినీ నటుడు నాగ మహేష్ గురువారం దర్శించుకున్నారు. ఉదయం స్వామి వారి ఆలయానికి చేరుకున్న ఆయన నాగపుట్టలో పాలుపోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు బుద్దు ఫణికుమార్ శర్మ, వెంకటేశ్వరరావు స్వామివారికి అభిషేకం నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

స్వచ్ఛ చల్లపల్లికి విరాళం

చల్లపల్లి: స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమానికి దాతలు రూ.50 వేలు విరాళం అందజేశారని కన్వీనర్ డాక్టర్ డీఆర్కే ప్రసాద్ తెలిపారు. మోపిదేవి మండలం శివరామపురం గ్రామానికి చెందిన మల్లంపాటి ప్రేమానంద్ కుమారుడు, కోడలు మల్లంపాటి సందీప్–మంజూష స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమానికి రూ.50 వేలను ఆన్‌లైన్ ద్వారా మన కోసం మనం ట్రస్ట్‌కు విరాళంగా పంపించారని చెప్పారు.

నేడు డయల్ యువర్ డీఎం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ఏపీఎస్ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, సలహాలు తీసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఏర్పాటు చేశామని డీఎం టి. పెద్దిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రయాణికులు సెల్: 99592 25462 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు ఇవ్వాలని డీఎం కోరారు.

వృద్ధాశ్రమానికి శంకుస్థాపన

చల్లపల్లి: అనాథ వృద్ధులకు సేవ చేయడం దేవుని సేవతో సమానమని ఉప సర్పంచ్ ముమ్మనేని రాజకుమార్ (నాని) అన్నారు. గురువారం స్థానిక నిమ్మలతోటలోని సీయోను వృద్ధాశ్రమం ఆవరణలో నూతన ఆశ్రమ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏబీసీ రాష్ట్ర నాయకులు కోట కరుణ కుమార్, పాస్టర్ మోక్షానందం, మచిలీపట్నం కోన ఫౌండేషన్ చైర్మన్ కోన నాగార్జున ఆశ్రమ నిర్మాణానికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

వృద్ధులకు అన్నదానం

నాగాయలంక: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో నిత్యాన్నదాన కమిటీ ఆధ్వర్యంలో నిరుపేద వృద్ధులు, దివ్యాంగులకు గురువారం అన్నదానం చేశారు. చిట్టా లక్ష్మీనారాయణ, సుధారాణి, రాజేష్, దివ్యశాలిని ఆర్థిక సహకారం అందించారు. కార్యక్రమ సంధానకర్తలు రాచవెట్టి పాపారావు, పొన్నపల్లి చిన్నా పర్యవేక్షించారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

కోడూరు: పేకాట శిబిరంపై కోడూరు పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. అవనిగడ్డ సీఐ ఎల్.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మందపాకల గ్రామ సమీపంలోని చెరువుల వద్ద ఉన్న ఓ పూరి గుడిసెలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందింది. ఎస్ఐ రాజేంద్రప్రసాద్ సిబ్బందితో కలిసి శిబిరంపై దాడులు నిర్వహించారు. ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.61,800 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ప్రజా రక్షణ భేరి యాత్ర

మచిలీపట్నంటౌన్: దేశంలోని పలు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. లోకనాథం అన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా రక్షణ భేరి యాత్ర గురువారం రాత్రి మచిలీపట్నంలోని కోనేరు సెంటర్‌కు చేరింది. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.



భావదేవరపల్లి సభలో మాట్లాడుతున్న కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చిన్నారి



యండపల్లి సచివాలయం వద్ద డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ



పెడనలో బోర్డును ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ నాగకుమారి, రాణి తదితరులు



వి.కొత్తపాలెంలో సంక్షేమ బోర్డు వద్ద వివరాలు తెలుపుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు



గూడూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మధుసూదనరావు

జగన్ పాలన దేశానికే ఆదర్శం

- రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు
- అన్ని వర్గాలకు మేలు
- 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి' సభలలో ప్రజాప్రతినిధులు

భావదేవరపల్లి(నాగాయలంక): సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని, అన్ని వర్గాల వారు సంతోషంగా ఉన్నారని ప్రజాప్రతినిధులు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి, పల్లెకుపోదాం కార్యక్రమాలు గురువారం అవనిగడ్డ, మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో నిర్వహించారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించారు. గత చంద్రబాబు ప్రభుత్వానికి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి గల తేడాను వివరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. నాగాయలంక మండలం భావదేవరపల్లి సచివాలయం పరిధిలో అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పర్యవేక్షణలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి, పల్లెకు పోదాం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. నాగాయలంక ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మోకా బుచ్చిబాబు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మద్ది చిన్నారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భోగాది శేషగిరిరావు, ఎంపీడీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ భావదేవరపల్లి సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు డీబీటీ–నాన్ డీబీటీ కింద రూ.25,29,15,830, అభివృద్ధి పనులకు రూ.2,08,85,000 (మొత్తం రూ.27,38,00,830) ప్రభుత్వం ఖర్చు చేసిందని వివరించారు. తొలుత ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వం అందించిన లబ్ధి వివరాల బోర్డును సచివాలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈఓపీఆర్డీ కె.అప్పల నరసమ్మ, మండల పరిషత్ వైస్ చైర్మన్ పరిశె అమ్మన్న, పీఏసీఎస్ చైర్‌పర్సన్ సాయిబాబు, దేవస్థానం ధర్మ కర్త భోగాది విశ్వేశ్వరరావు, నాయకులు చెన్ను రంగారావు, బాబీకుమార్, చందు మురళి, భోగాది మురళి, బండ్రెడ్డి లక్ష్మీనారాయణ, బీమా బాబూరావు, గ్రామ కార్యదర్శి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

పారదర్శక పాలన..

కృత్తివెన్ను: గత పాలకులకు, నేటి జగనన్న పాలనకు వ్యత్యాసాన్ని తెలియజేయడంతో పాటు, గ్రామాల పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించేలా పల్లెకుపోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, జగనన్న పారదర్శక పాలన అందించారని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. యండపల్లి సచివాలయం వద్ద పల్లెకుపోదాం కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత సచివాలయం వద్ద వివిధ పథకాల లబ్ధి వివరాలను డిస్‌ప్లే బోర్డులో ప్రదర్శించారు. డిస్‌ప్లే బోర్డును పార్టీ మండల కన్వీనర్ వైదాని వెంకట్రాజు ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో పలువురు నాయకులు మాట్లాడారు. మండల ప్రత్యేకాధికారి డీఎల్‌డీఓ జి. పద్మ, ఎంపీడీఓ పిచ్చిబాబు, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, స్టేట్ కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పిన్నెంటి మహేష్, ప్రజాప్రతినిధులు, పలు విభాగాల నాయకులు పాల్గొన్నారు.

పెడనలో..

పెడన: పెడన పట్టణంలోని ఒకటో సచివాలయంలో సైన్‌బోర్డును మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి, మాజీ చైర్‌పర్సన్ బళ్ల జ్యోత్స్నరాణి ఆవిష్కరించారు. అనంతరం సచివాయాల పరిధిలో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు మాట్లాడారు. పట్టణంలోని ఒకటో సచివాలయంలో పరిధిలో సంక్షేమ పథకాల కింద రూ.20,62,79,072లను లబ్ధిదారుల ఖాతాలకు నగదును జమ చేశారని, ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణాలు తదితర రూపాలలో (నగదు రూపంలో కాకుండా) రూ.11,40,43,710 గల వాటిని అందజేశామని చైర్‌పర్సన్ నాగకుమారి వివరించారు. ఇవి కాకుండా నాడు నేడు కింద పాఠశాలలు, ఆస్పత్రి అభివృద్ధికి రూ.1,38,50,000, గడపగడపకు మన ప్రభుత్వ నిధులు రూ.40 లక్షలు, 14, 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.30,05,6000లతో పట్టణంలోని 1, 2, 3వార్డులలో అభివృద్ధి పనులు చేశామని వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ మల్లి, సచివాలయాల కన్వీనర్ మతీన్‌ఖాన్, మున్సిపల్ కమిషనర్ మహేంద్ర, టీపీఓ ఏసుబాబు, నాయకులు పాల్గొన్నారు.

బల్లిపర్రులో ..

మండలంలోని బల్లిపర్రు గ్రామ సచివాలయంలో సైన్‌బోర్డులను మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు రాజులపాటి అచ్యుతరావు ఆవిష్కరించారు. గ్రామ సచివాలయం పరిధిలోని రూ.12,18,20,874ల నగదును లబ్ధిదారులకు నేరుగా వారి బ్యాంకు ఖాతాలకు జమ చేశామని ఆయన తెలిపారు. ఇతర పథకాలు ద్వారా అందించిన లబ్ధిని వివరించారు. మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, నాయకులు పాల్గొన్నారు.

'పల్లెకు పోదాం' ప్రారంభం

కోడూరు: మండలంలోని వి.కొత్తపాలెం సచివాలయం వద్ద మండల పరిషత్ అధికారులు పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఏర్పాటు చేశారు. ప్రత్యేక నగదు బదిలీ కింద 8,035మంది లబ్ధిదారులకు రూ.25.47కోట్లు, పరోక్ష ప్రయోజనాల ద్వారా 2,260 మందికి రూ.9.78కోట్ల నగదును అందించామని ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. సచివాలయ పరిధిలో రూ.2.12కోట్లతో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. సచివాలయం ద్వారా మొత్తం రూ.37.38కోట్ల లబ్ధి చేకూరిందని వివరించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, మండల కన్వీనర్ పరిశె మాధవరావు, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, రైతు సంఘం నేత రేపల్లె రాజయ్య, ఈఓపీఆర్డీ నాగరేవతి, కార్యదర్శి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరు: ఆంధ్రాకు జగనే ఎందుకు సీఎం కావాలి కార్యక్రమాన్ని గురువారం గూడూరు–1 గ్రామ సచివాలయంలో నిర్వహించారు. సచివాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల బోర్డును ఎంపీపీ సంగా మధుసూదనరావు ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించిన నాయకులు ఇంటింటికీ వెళ్లి గత పాలనకు, జగనన్న పాలనకు వ్యత్యాసాన్ని వివరించారు. జెడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, సర్పంచి లింగం సులోచనారాణి, మండల పార్టీ కన్వీనర్ పర్ణం మహలక్ష్మయ్యనాయుడు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, పలు విభాగాల కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

ముంజులూరులో..

బంటుమిల్లి: ముంజులూరు గ్రామ సచివాలయం వద్ద స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తూ ఏర్పాటుచేసిన బోర్డును ఆవిష్కరించారు. ఎంపీడీఓ జె. స్వర్ణభారతి మాట్లాడుతూ ముంజులూరు గ్రామంలో వలు పథకాల ద్వారా సుమారు రూ. 17 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. గ్రామంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు గ్రామంలో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేశారు. సర్పంచ్ కూనపరెడ్డి సునీత పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ వెలివెల చినబాబు, జెడ్పీటీసీ మల్లిశెట్టి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సుజ్ఞానం మహేష్, మట్టా నాగబాబు, శ్రీనివాసు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

లక్ష్మీపురంలో..

లక్ష్మీపురం(చల్లపల్లి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజలు ఆకర్షితులై మరోసారి జగనన్న సీఎం కావాలని కోరుకుంటున్నారని జెడ్పీటీసీ రాజుల పాటి కల్యాణి అన్నారు. గురువారం స్థానిక గ్రామ సచివాలయం–1 కార్యాలయంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరించారు. అనంతరం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీడీఓ చేకు చిన రాట్నాలు, పార్టీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

రుద్రవరంలో..

కోనేరుసెంటర్: రుద్రవరం గ్రామంలో గురువారం రాత్రి జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరించి మరోసారి ముఖ్యమంత్రి జగనన్నను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ శొంఠి ఫరీద్, రవిశంకర్, గ్రామ ఇన్‌చార్జి అంగడాల ఫణికుమార్, అశ్విని, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ముంజులూరు సచివాలయం వద్ద డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరణ



లక్ష్మీపురంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న శీరం నాని

జగన్‌తోనే సంక్షేమ పథకాల కొనసాగింపు

మచిలీపట్నంటౌన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని బలరామునిపేట–1 సచివాలయం వద్ద గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పేర్ని కిట్టు మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దేశంలోనే రాష్ట్రం పలు రంగాల్లో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. సీఎం జగన్ నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రంలోని బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో అమలైన సంక్షేమ పథకాల వివరాలతో ఏర్పాటు చేసిన బోర్డును ఆవిష్కరించారు. పార్టీ జెండాను మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ ఆవిష్కరించారు. అనంతరం డివిజన్‌లో పర్యటిస్తూ ఇంటింటికి వెళ్లి జెండాను కట్టారు. డిప్యూటీ మేయర్ శీలం భారతి, మాజీ డిప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, పలువురు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



బందరు సభలో మాట్లాడుతున్న పేర్ని కిట్టు. చిత్రంలో మేయర్ వెంకటేశ్వరమ్మ

పేదల బాధలు, కష్టాలు తెలిసిన సీఎం జగనన్న



మోపిదేవిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు



పులిగడ్డలో పాల్గొన్న ఎమ్మెల్యే సింహాద్రి, తదితరులు

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

మోపిదేవి: పేదల బతుకులు బాగుపడాలంటే మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాల్సిన అవసరం ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మోపిదేవి గ్రామ సచివాలయం–1లో పల్లెకుపోదాం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ప్రజలకు చేకూరిన లబ్ధివివరాలను డిస్ ప్లే బోర్డు ద్వారా ప్రదర్శిస్తున్నామని చెప్పారు. ఇంకా అర్హులు ఉంటే వారిని కూడా గుర్తించి న్యాయం చేస్తామన్నారు. పేదల బాధలు, కష్టాలు తెలిసిన సీఎంను మరోసారి దీవించాలని కోరారు. అనంతరం గ్రామంలో ఇంటింటా లబ్ధిదారులకు అందిన పథకాలను చదివి వినిపించారు. 10,362 మంది లబ్ధిదారులకు గాను వివిధ సంక్షేమ పథకాలకు రూ. 30 కోట్ల 75 లక్షల 923లు, వివిధ అభివృద్ధి పనులకు గాను రూ. 3 కోట్ల 47 లక్షల 10 వేలు ఖర్చుచేసినట్లు ఎంపీడీఓ వివరించారు. అనంతరం ప్రధాన సెంటర్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. రాత్రికి దళితవాడలో సర్పంచ్ నందిగం మేరీరాణి ఇంటి వద్ద బస చేశారు. సర్పంచ్ నందిగం మేరీ రాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు గరికిపాటి వెంకటేశ్వరావు, మండల సచివాలయ కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ రావి రాంప్రసాద్, లింగం జగదీష్‌కుమార్, తోట కృష్ణాంజనేయులు, కామిశెట్టి వెంకట సురేష్‌బాబు, నందిగం అభిషేకరావు, చోడాబత్తిన పూర్ణచంద్రరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

పులిగడ్డ పాత కోటలో..

పులిగడ్డ(అవనిగడ్డ): ఎన్నికల ముందు పేదలకు ఇచ్చిన ప్రతి హామీని సీఎం వైఎస్ జగన్ అమలు చేశారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. గురువారం సాయంత్రం పులిగడ్డ పాత కోటలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. తొలుత గ్రామంలో వివిధ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చిన వివరాల బోర్డును, వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రేపల్లె శ్రీనివాసరావు, నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతి దేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

విశిష్ట సేవలందించిన న్యాయమూర్తి ఫజులుల్లా



చిలకలపూడి(మచిలీపట్నం): ఏడాదిన్నర కాలంలో పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తిగా డాక్టర్ షేక్ మొహమ్మద్ ఫజులుల్లా విశిష్ట సేవలు అందించారని ఒకటో అదనపు జిల్లా న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు అన్నారు. పోక్సో కోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తూ హైకోర్టు రిజిస్ట్రార్‌గా బదిలీ అయిన షేక్ మొహమ్మద్ ఫజులుల్లా వీడ్కోలు, సన్మాన కార్యక్రమం బార్ అసోసియేషన్ హాల్‌లో గురువారం నిర్వహించారు. ఫజులుల్లాను పలువురు ఘనంగా సన్మానించారు. న్యాయమూర్తులు ఎ. నరసింహమూర్తి, పి. రామకృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తుంగల హరిబాబు, కొట్టి రఘురామ్, ఎస్. నగధర్‌నాథ్, వై. నాగభూషణం, లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు

గూడూరు: గూడూరులోని హజ్రత్ నాల్ సాహెబ్ ఆస్తానాలో గురువారం గ్యార్మీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హజ్రత్ గౌసె ఆజం దస్తగిర్ సంస్మరణ వేడుకల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో గౌసె ఆజం దస్తగిర్ జీవిత చరిత్రను పఠనం చేశారు. హాఫిజ్ షోయబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు షేక్ అబ్దుల్ మన్నాన్, ఎండీ నూరుల్లా, జమాల్ బేగ్, జహంగీర్ బేగ్, షేక్ అలి, నిర్గన్‌షా, ఫెరోజ్, ఇద్రీస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మేలు చేస్తున్న జగనన్న ప్రభుత్వం

- మంత్రి జోగి రమేష్
- జయలక్ష్మీ పీఏసీఎస్‌లో అదనపు భవనం ప్రారంభం

పెడన: రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నది..ఆదుకుంటున్నది వైఎస్సార్ కుటుంబమేనని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఆ నాడు రైతును రాజును చేసింది దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అయితే నేడు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతును రారాజును చేస్తున్నాడని చెప్పారు. స్థానిక జయలక్ష్మీ పీఏసీఎస్‌లో రూ.5.95 లక్షలతో నిర్మించిన అదనపు నూతన భవనాన్ని మంత్రి గురువారం ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పీఏసీఎస్‌ల బలోపేతానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని విధాలుగా చర్యలు తీసుకున్నారని, తద్వారా రైతులకు రుణాలు ఇవ్వడమే కాకుండా వాటిని మాఫీ కూడా చేస్తున్నారని చెప్పారు. రైతులు నష్టపోతే పరిహారం అందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో జయలక్ష్మీ పీఏసీఎస్ చైర్మన్ వరుదు రామకృష్ణ, ఉమాదేవి దంపతులు, సభ్యులు అఫ్రపున్నీసా, కె. రామచంద్రరావు, నాయకులు పాల్గొన్నారు.



జయలక్ష్మీ పీఏసీఎస్ అదనపు భవన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి జోగి రమేష్

ఉమ్రా యాత్రకు బయల్దేరిన కుటుంబానికి మంత్రి వీడ్కోలు

ఉమ్రా పవిత్ర యాత్రకు బయల్దేరిన పెడన పట్టణానికి చెందిన కేజీఎస్ బాజీతో పాటు కుటుంబ సభ్యులకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ ఘనంగా వీడ్కోలు పలికారు. అల్లా అంతా చల్లగా చూడాలని, ప్రయాణం సజావుగా సాగి క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ బండారు మల్లి, పలువురు కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

కోనేరుసెంటర్: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి జి. జ్ఞానమణి అన్నారు. యూనివర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలు గురువారం నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థులు సోదర భావం కలిగి ఉండాలన్నారు. అప్పుడే యూనివర్సిటీ ప్రాంగణంలో స్నేహపూరిత వాతావరణం కనిపిస్తుందని చెప్పారు. ఉన్నతమైన విద్యను అభ్యసించి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్. విజయకుమారి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరి పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్ వైకే సుందర కృష్ణ, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఆర్. కిరణ్ కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఫ్రెషర్స్ డే వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

చట్టాలపై అవగాహన అవసరం

న్యాయమూర్తి సుధాకరరావు



మాట్లాడుతున్న న్యాయమూర్తి సుధాకరరావు

బంటుమిల్లి: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి ఇ. సుధాకరరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని మల్లేశ్వరం సచివాలయం వద్ద న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ వివిధ చట్టాలపై అవగాహన కల్పించారు. రైతులు ఆర్థిక లావాదేవీల సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. న్యాయం అవసరమైన ప్రతి ఒక్కరికీ కోర్టు ద్వారా ఉచితంగా సేవలందిస్తామని, అవసరమైన వారు కమిటీ సభ్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాళ్ల సోమశేఖర్ (శ్యాంబాబు), న్యాయవాదులు రాయుడు, సురేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బందరులో విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

మచిలీపట్నంటౌన్: నగరంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ కె. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అధికారులు 38 బృందాలుగా ఏర్పడి 635 గృహ సర్వీసులు, 627 వాణిజ్య సముదాయ సర్వీసులను తనిఖీ చేశారు. 136 సర్వీసులకు అదనపు లోడు 180 కిలో వాట్ల మొత్తానికి రూ. 5.30 లక్షల మేర అపరాధ రుసుం వసూలు చేశారు. అక్రమ కేటగిరీలో వినియోగిస్తున్న రెండు సర్వీసుల యజమానులకు రూ. 20 వేలు జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడితే సెల్: 94408 12362, 94408 12363 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. విజిలెన్స్ తనిఖీల్లో విద్యుత్ మచిలీపట్నం డివిజన్ ఈఈ మన్నెం భాస్కరరావు, డీఈఈలు కె. రామకృష్ణ, శ్రీనివాసరావు, మాణిక్యాలరావు, సుందరరావు, డీ1 సెక్షన్ ఏఈ షేక్ జానీబాషా, మచిలీపట్నం డివిజన్ పరిధిలోని ఏఈలు, లైన్‌ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బాణాసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

కోడూరు: దీపావళి బాణసంచా విక్రయాల్లో వ్యాపారులు నిబంధనలు పాటించాలని అవనిగడ్డ సీఐ ఎల్.రమేష్ అన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గం పరిధిలోని అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలంలో ఫైర్, రెవెన్యూ, పోలీస్‌శాఖ పర్యవేక్షణలో బాణసంచా విక్రయాలకు తాత్కాలిక లైసెన్సులను మంజూరు చేశామని చెప్పారు. పండుగ రోజు మాత్రమే టపాసులను విక్రయించుకోవాలని, బాణసంచాను నిల్వ చేసి విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతులకు లోబడి విక్రయాలు జరపాలని, విక్రయ కేంద్రాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పండుగను అందరూ సుఖసంతోషాలతో నిర్వహించుకోవాలని సీఐ కోరారు. ఎస్ఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

■ **గూడూరు:** దీపావళిని పురస్కరించుకుని అనుమతి లేకుండా మందుగుండు సామగ్రి అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు తహసీల్దార్ బి.విజయప్రసాద్ హెచ్చరించారు. గూడూరులో మందుగుండు సామగ్రి స్టాల్స్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను గురువారం ఫైర్ అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. మందుగుండు సామాగ్రి అమ్మకాలకు అనుమతులు పొందిన వారు నిబంధనల ప్రకారం స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.